క్లుప్తంగా

ప్రశాంతంగా ఏపీ ఈసెట్



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఏపీ ఈసెట్–2025 ప్రవేశ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన సెషన్‌లో 180 మందికి గాను 180 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ బీఆర్‌ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 153 మందికి 147 మంది హాజరయ్యారన్నారు. రెండు సెషన్లకు కలిపి 333 మందికి గాను 327 మంది హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు.

స్వచ్ఛందంగా పంటకాలువ పూడికతీత పనులు

పాగోలు గ్రామ రైతుల ఆదర్శం



చల్లపల్లి: ప్రభుత్వం నుంచి స్పందన కొరవడటంతో చేసేది లేక మండల పరిధిలోని పాగోలు గ్రామానికి చెందిన రైతులు ముందుకు వచ్చి పంట కాలువలోని పూడికను తీసే పనిని మంగళవారం స్వచ్ఛందంగా చేపట్టారు. తొమ్మిదవ నంబర్ పంటకాలువ నుంచి పాగోలు గ్రామంలోని ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే కాలువ పూడుకుపోయింది. అధికారులు కొన్నేళ్లుగా ఈ కాలువలో పూడిక తీయించడం లేదు. ఈ ఏడాదైనా తీయిస్తారో లేదో తెలియని పరిస్థితుల్లో గ్రామస్తులు తామే నడుం బిగించారు. స్వచ్ఛందంగా పొక్లెయిన్ ఏర్పాటుచేసుకుని పూడికను తీయించుకుంటున్నారు. ఈ పనులను పాగోలు ఎంపీటీసీ సభ్యుడు మేకా సత్యనారాయణప్రసాద్(బంగారుబాబు), కె.కొత్తపాలెం నీటి సంఘం వైస్ చైర్మన్ మేకా శివప్రసాద్, రైతులు మట్టా కమలాకరరావు తదితరులు పర్యవేక్షించారు.

దేశ వ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఈనెల 20 వ తేదీన జరగనున్న ఒక రోజు దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను ఆ సంఘ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిశోర్ కుమార్ మాట్లాడుతూ మే 20 వ తేదీన 10 కేంద్ర కార్మిక సంఘాలతో పాటుగా, దేశ వ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, వివిధ రంగాలలో పని చేస్తున్న ఉద్యోగులు సుమారు 20 కోట్ల మంది ఈ సమ్మెలో పాల్గొననున్నారని వివరించారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక అనుకూల చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లుగా అమల్లోకి తీసుకురావడాన్ని యావత్ కార్మిక వర్గం వ్యతిరేకిస్తోందని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.సుధాకర్, డి.వాసు, ఎల్.రాజశేఖర్, వై.స్వామినాథ్, బి.మాధుర్, బండి శ్రీనివాస్, పి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అంకమ్మ అమ్మవారికి నైవేద్యాల సమర్పణ

బొబ్బర్లంక(మోపిదేవి): మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో ఉన్న శ్రీ అంకమ్మ అమ్మవారి ఆలయ 10వ వార్షికోత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం వేదపండితులతో చండీహోమం, రుద్రహోమం అనంతరం పూర్ణాహుతి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, జగదీష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మంగళవారం సాయంత్రం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. రాత్రి అన్న సమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బీసీల కుట్టు శిక్షణ స్కామ్‌పై విచారణ చేపట్టాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ చెన్ను డిమాండ్

నాగాయలంక: రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అవినీతికి పరాకాష్టగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు మంగళవారం ధ్వజమెత్తారు. బీసీ, ఈబీసీ వర్గాలు, కాపు మహిళలకు ఇచ్చే కుట్టు శిక్షణలోనూ ఏకంగా రూ.154 కోట్ల నుంచి రూ.245 కోట్ల వరకు కొల్లగొట్టేందుకు వేసిన పథకమే ఇందుకు పక్కా నిదర్శనమన్నారు. తక్షణమే కుట్టు శిక్షణ స్కామ్‌పై విచారణ చేపట్టాలని రంగారావు డిమాండ్ చేశారు.

నగరంలో పడకేసిన పారిశుద్ధ్యం

- స్వయంగా కలెక్టర్ పర్యటించి ఆదేశించినా ఫలితం శూన్యం
- కానరాని శానిటరీ సెక్రటరీలు



నగరంలోని జిల్లా కోర్టు రోడ్డులో డ్రెయిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు, గడ్డి



పోలీసు రామాలయం సెంటర్‌లో నిత్యం దర్శన మిస్తున్న చెత్త కుప్ప

మచిలీపట్నంటౌన్: నగరంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా కొనసాగుతోంది. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నగర పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి సూచనలు ఇచ్చినా షరా మామూలుగానే మారింది. నగరంలోని పారిశుద్ధ్యాన్ని గాడిన పెట్టేందుకు కలెక్టర్ బాలాజీ నగరంలో కొన్ని రోజుల పాటు క్షేత్ర స్థాయి పర్యటనలు చేసినా ఫలితం లేకుండా పోయింది. గతం కంటే నేడు నగరంలో పారిశుద్ధ్య మెరుగునకు వనరులు, సిబ్బంది పెరిగినా ఏ మాత్రం మార్పు కన్పించటం లేదు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు మున్సిపల్ ట్రాక్టర్‌లకు తోడు కూటమి పాలకుల ఆదేశాలతో అదనంగా ట్రాక్టర్‌లను ఏర్పాటు చేసినా పారిశుద్ధ్య పరిస్థితి మెరుగు పడలేదు. నగరంలోని 50 డివిజన్లలో ఏ ప్రాంతంలోని కచ్చా, పక్కా డ్రెయిన్‌లను చూసినా సిల్ట్ పెద్ద ఎత్తున పేరుకుపోయి దర్శనమిస్తోంది. డ్రెయిన్‌లలో పిచ్చి మొక్కలు, గడ్డి పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. జిల్లా ఎస్పీ, జిల్లా జాయింట్ కలెక్టర్ బంగ్లాల సమీపంలో సైతం పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటోంది. పోలీసు కల్యాణ మండపం, పోలీసు రామాలయం సెంటర్‌లో ఎప్పుడు చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తూనే ఉంటాయి. అనునిత్యం జిల్లా ఎస్పీతో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు ఈ దారిలోనే ప్రయాణిస్తూ ఉంటారు. అయినా పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చలేని స్థితిలో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

శానిటరీ సెక్రటరీల పర్యవేక్షణ పూజ్యం

నగరంలో 50 డివిజన్‌లలోని సచివాలయాల్లో శానిటేషన్ సెక్రటరీలు ఉన్నారు. పలు డివిజన్‌లలో ఈ సెక్రటరీలు కన్పించటం లేదు. కార్మికులను వారి మానాన వదిలేస్తున్నారు. పర్యవేక్షణ అధికారులు లేకపోవటంతో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో జరగటంలేదని ప్రజలు వాపోతున్నారు. సెక్రటరీలు సమయానికి ఎఫ్ఆర్ఎస్ వేసి విధుల్లో లేకుండా సొంత పనులు చేసుకుంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. సెక్రటరీలు బాధ్యతగా పని చేసే డివిజన్‌లలో మాత్రమే పారిశుద్ధ్యం కొంతైనా మెరుగ్గా ఉంటోందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ముందస్తు ప్రణాళికతో వర్షాకాలం రాకముందే డ్రెయిన్‌లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు, డివిజన్లలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

నగర ప్రజలకు తాగునీటి సమస్య రానివ్వం

మంత్రి కొల్లు రవీంద్ర



రిజర్వాయర్ వద్ద పైప్‌లైన్‌లకు నీటిని వదులుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: ఈ వేసవిలో నగర ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. నగరంలోని రెండవ డివిజన్ పరిధిలోని మాచవరంలో మంగళవారం దాదాపు రూ.2.68 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 500 కిలో లీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్‌ను జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, ఇతర కూటమి నాయకులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా దాదాపు ఐదు లక్షల లీటర్లను నిల్వ చేసి నగర ప్రజలకు అందించనున్నారన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 14 ప్రాంతాలలో రిజర్వాయర్లను ఏర్పాటు చేసుకున్నామని, భవిష్యత్తులో అవసరం మేరకు మరిన్ని రిజర్వాయర్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి దృష్ట్యా ఎక్కడా నీటి సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో ఇటీవల దాదాపు వెయ్యి హార్స్ పవర్ సామర్థ్యం గల మోటార్లను పెట్టి తరకటూరులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నింపామన్నారు. దీనివల్ల బందరు నగరంతో పాటు బందరు మండలం, పెడనకు రాబోయే రెండు నెలలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సరిపోయినంత నీటి లభ్యత ఉందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



రాయవరంలో కిశోరి వికాసం కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రేవతి

ఘంటసాలపాలెం(ఘంటసాల): కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని ఏఎన్ఎం జి.సునీత అన్నారు. ఘంటసాల మండలం ఘంటసాలపాలెం అంగన్‌వాడీ సెంటర్ 1లో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం సునీత మాట్లాడుతూ బాల్య వివాహాలు, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులకు, బాలికలకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే బాలికలకు వివాహం చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త జి.కమల, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కనకదుర్గ, ఎస్.మానస, ఎం.ఉమాదేవి, కిశోర బాలికలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

గూడూరు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని ఐసీడీఎస్ మల్లవోలు సెక్టారు సూపర్‌వైజర్ జన్ను రేవతి అన్నారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాయవరం గ్రామంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి బాల్యవివాహాలు, గుడ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కె ఎం.సౌజన్య, ఇజ్జినేని చంద్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్లు, పొక్లెయిన్ స్వాధీనం



ఘంటసాల: అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం యండకుదురు శివారు జీలగలగండి గ్రామంలో అక్రమంగా మట్టి తరలించేందుకు వెళ్తున్న ఒక పొక్లెయిన్, మూడు ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని సోమవారం రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మూడు ట్రాక్టర్లకు ఒక్కో ట్రాక్టర్‌కు రూ.700, జేసీబీకి రూ.1000 జరిమానా విధించినట్లు చెప్పారు. చల్లపల్లి మండలం మాజేరు శివారు పచ్చార్లంకలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, ఆ మట్టిని తరలించేందుకు ట్రాక్టర్లు వెళ్తున్నట్లు పోలీసులకు ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు సమాచారం వచ్చిందన్నారు. ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి ఆ ట్రాక్టర్లు, పొక్లయిన్‌ను అదుపులోకి తీసుకుని సోమవారం రెవెన్యూ అధికారులకు అప్పగించగా జరిమానా విధించినట్లు తహసీల్దార్ చెప్పారు.

సహాయ ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం

పెడన: సహాయ ఫౌండేషన్ ఏర్పడి 9 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆవిర్భావ దినోత్సవాన్ని కార్యాలయంలో ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థుల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు మహమ్మద్ ఉస్మాన్ బాషా, ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాద్, విద్యా విభాగం చైర్మన్ మట్టా రాధాకృష్ణమూర్తి, రౌతుల ప్రసాద్, బడుగు ఉమాదేవి, కుర్షిద్ బేగం, బట్ట దుర్గాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

15 ఆటోలు, బైకులకు జరిమానా



చల్లపల్లి: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 15 ఆటోలు, ద్విచక్ర వాహనాలకు అపరాధ రుసుము విధించినట్లు ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక ప్రధాన సెంటర్లో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించగా పట్టుకున్న వాహనాలకు సంబంధించి రూ.2830 జరిమానా విధించినట్లు చెప్పారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు విద్యార్థులకు ఆటవిడుపు

కొడాలి(ఘంటసాల): బాలబాలికల్లో విజ్ఞానం పెంపొందాలంటే గ్రంథాలయాలను సందర్శించాలని కొడాలి గ్రంథాలయాధికారి ఎం.సుబ్బారావు అన్నారు. ఘంటసాల మండలం కొడాలి గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సెల్ ఫోన్లు, టీవీలకు అలవాటు పడకుండా గ్రంథాలయాలకు వచ్చి వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు నిర్వహించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. కార్యమ్స్, లూడో, చెస్ ఆటలు ఆడించారు.

పుస్తక పఠనంతో మానసిక వికాసం

మోపిదేవి: విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను దర్శించి పుస్తకాలను చదవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కంఠంనేని కుటుంబరావు అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం పిల్లల మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. గ్రంథాలయ అధికారి సుధీర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, అనర్గళంగా మాట్లాడగలిగే నైపుణ్యాలను బోధిస్తామని వివరించారు.

మూడు నెలలుగా మూతబడిన ఎస్‌బీఐ ఏటీఎం



కోడూరులో మూతబడిన ఎస్‌బీఐ ఏటీఎం

కోడూరు: కోడూరు మండల ప్రజలకు మూడు నెలల నుంచి ఎస్‌బీఐ ఏటీఎం సేవలు పూర్తిగా దూరమయ్యాయి. స్థానిక ప్రధాన సెంటర్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎంను ఆ బ్యాంక్ ఆధ్వర్యంలో సుమారు పదేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. గతంలో కేవలం ఒక్క ఏటీఎం మిషన్ మాత్రమే ఉండగా, ప్రజల అవసరాల దృష్ట్యా రెండేళ్ల క్రితం మరో ఏటీఎం మిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. అయితే మూడు నెలల నుంచి ఎస్‌బీఐకు సంబంధించిన ఏటీఎం సేవలను బ్యాంక్ పూర్తిగా నిలిపివేసింది. ఏటీఎం కేంద్రాన్ని మూసివేసింది. దీంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో నగదు డ్రా చేసుకునేందుకు కూడా ఏటీఎం లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. ఏటీఎం సేవలను నిలుపుదల చేయడంపై ప్రజలు సంబంధిత బ్యాంకు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఏటీఎం లేకపోవడంతో సెలవుదినాలు, పండుగల సమయంలో నగదు డ్రా చేసే వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 13 పంచాయతీల ప్రజలకు ఈ ఏటీఎం ఒక్కటే ఆధారం. ప్రస్తుతం అది కూడా మూతబడడంతో 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న అవనిగడ్డ వెళ్లి నగదు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఎస్‌బీఐ ఏటీఎం సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మడకలో యథేచ్ఛగా మట్టి తోలకం

పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది



మడక గ్రామ సమీపంలో టిప్పర్‌లోకి మట్టిని తోడుతున్న దృశ్యం

పెడన: మండలంలో మట్టి తెలుగుతమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. ఒక పక్క అధికారులు నిఘా పెట్టి మట్టి తోలకాన్ని అడ్డుకుంటున్నామని చెబుతున్నా వారి మాటలను లెక్కచేయకుండా ఏకంగా టిప్పర్ల ద్వారా మట్టిని తరలించుకుపోతున్నారు. అదేమని ప్రశ్నిస్తుంటే ఎమ్మెల్యే తాలుకా అంటూ అధికారులను బెదిరిస్తున్నారు. క్షేత్రస్థాయిలోని రెవెన్యూ సిబ్బంది సైతం చూసీచూడనట్లు పోతున్నారు. మరికొందరు మాకేంటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆకస్మిక దాడులు నిర్వహిస్తే మట్టి అక్రమ రవాణా అరికట్టడానికి వీలవుతుందని స్థానికులు అంటున్నారు. మండలంలోని మడక గ్రామ పరిధిలో జేసీబీలతో మట్టిని టిప్పర్ల ద్వారా తరలించుకుపోతున్నా అటుగా ఎవరూ కన్నెత్తి చూడకపోవడం విడ్డూరంగా ఉంది. స్వయంగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నేటి నుంచి నాగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



విద్యుద్దీపాలతో శోభాయమానంగా దర్శనమిస్తున్న శ్రీ నాగేశ్వరస్వామి ఆలయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఖొజ్జిల్లిపేటలో ఉన్న శ్రీ బాలా త్రిపురసుందరీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకూ ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేయటంతో పాటు రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించటంతో శోభాయమానంగా దర్శనమిస్తోంది. బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీ నాగేశ్వరస్వామి వారిని పెండ్లి కుమారునిగా చేయటంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 9వ తేదీ శుక్రవారం అమ్మవారికి లక్ష మల్లెల పూజ చేయనున్నారు. ఈనెల 11వ తేదీ రాత్రి 8.30 గంటలకు ఆలయ అర్చకుడు రావూరి చైతన్య కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఈ నెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ జరిగే శ్రీ నాగేశ్వరస్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తాం. వేసవి దృష్ట్యా ఆలయానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి సౌకర్యంతో పాటు పందిళ్లను ఏర్పాటు చేశాం. ఉదయం, సాయంత్రం వేళల్లో జరిగే పూజా కార్యక్రమాలకు హాజరయ్యే భక్తులకు తీర్థప్రసాదాలను అందించనున్నాం.

– వై.శిరీష, ఆలయ ఈఓ

రేపటి నుంచి శ్రీభావన్నారాయణుని కల్యాణోత్సవాలు



ఆలయంలో కొలువైన శ్రీదేవి శ్రీభూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణస్వామి

భావదేవరపల్లి(నాగాయలంక): మండలంలో అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాభవం కలిగిన శ్రీదేవి, భూదేవి, శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణస్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, ఈఓ సీహెచ్ సుధాకరరావు మంగళవారం చెప్పారు. తొలిరోజు 8వ తేదీ ఉదయం స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెగా చేస్తారు. 9న హోమాలు, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ 10న నిత్యహోమం, బలిహరణ, రాత్రికి జగజ్యోతి, 11న రాత్రి 7గంటలకు ఎదుర్కోలు ఉత్సవం అనంతరం 8గంటలకు కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. 12వతేదీ పౌర్ణమి రోజు రథోత్సవం, మహా అన్నసమారాధన నిర్వహిస్తారు. 13న ధ్వజావరోహణం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 9వతేదీ రాత్రి సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ఉంటుందని వారు వివరించారు.

చెత్త నుంచి సంపద కేంద్రాల్లో తొట్టెల నిర్మాణం చేపట్టాలి



చిలకలపూడిలో చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద ఎంపీడీవో సుబ్బారావు, సర్పంచ్ విజయలక్ష్మి

వి.రుద్రవరం(ఘంటసాల): చెత్త నుంచి సంపద కేంద్రాల్లో చెత్త నిర్వహించే తొట్టెల నిర్మాణం వెంటనే చేపట్టాలని ఎంపీడీవో డి.సుబ్బారావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఘంటసాల మండలం వి.రుద్రవరం, చిలకలపూడి గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను ఎంపీడీవో సుబ్బారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వి.రుద్రవరంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో చెత్తను వేరు చేసే తొట్టెల నిర్మాణం చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసినా ఎందుకు తొట్టెల నిర్మాణం చేపట్టలేదంటూ అసహనం వ్యక్తం చేయడంతో పాటు నాలుగు రోజుల్లో వాటిని నిర్మించి సేకరించిన తడి చెత్తను సక్రమంగా నిర్వహణ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం వి.రుద్రవరంలో జరుగుతున్న పీఎంఏజేవై పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు వై.రామకృష్ణ ప్రసాద్, కొణతం విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు సతీష్, లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఏఎన్ఎంల నిరసన



గూడూరు: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల వ్యాఖ్యలను నిరసిస్తూ మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంలు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధనకోసం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(ఎంఎల్‌హెచ్‌పీలు) తమ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. వారి వ్యాఖ్యలు మా మనసులను బాధించాయని, అందుకు విధులకు హాజరవుతూ భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతున్నట్లు ఏఎన్ఎంలు తెలిపారు.

ప్రారంభమైన గోకర్ణేశ్వరుడి కల్యాణోత్సవాలు



పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తె అలంకారంలో గోకర్ణేశ్వరుడు, రాజ్యలక్ష్మీ అమ్మవారు

కోడూరు: దివిసీమలో ప్రసిద్ధిగాంచిన లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చరణలు, మేళతాళాల నడుమ ఉదయం గోకర్ణేశ్వరుడిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. ముందుగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, త్రిశూలపూజ, వాస్తుపూజను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణ నిర్వహించారు. రాజ్యలక్ష్మీ అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు.కల్యాణోత్సవాలను పురస్కరించుకుని గోకర్ణేశ్వరుడి లింగాకారుడికి పంచామృతాభిషేకాలను కనులపండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తబృందాల సభ్యులు శివనామ సంకీర్తనలు ఆలపించారు. బుధవారం ప్రత్యేక హోమాలు, రాజ్యలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, 8వ తేదీ రాత్రికి స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుధాకరరావు తెలిపారు.

స్వచ్ఛ చల్లపల్లికి రూ.5వేలు విరాళం

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లికి తన వంతుగా స్వచ్ఛ కార్యకర్త ప్రాతూరి ఉదయశంకర శాస్త్రి రూ.5వేలు విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌కు అందజేశారు. ప్రతి నెలా తన పెంచన్‌లో నుంచి కొంత మొత్తాన్ని స్వచ్ఛ సుందర చల్లపల్లి కోసం విరాళంగా ఇవ్వటం ప్రాతూరి ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు.

ఒలంపిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థి భరత్‌బాబు



భరత్‌బాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జూన్ నెలలో అహ్మదాబాద్‌లో జరగనున్న స్పెషల్ ఒలంపిక్ పోటీల్లో పాల్గొనేందుకు కంకిపాడు భవిత సెంటరుకు చెందిన విద్యార్థి భరత్‌బాబు ఎంపికయ్యారని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎం.ఫణిదూర్జటి మంగళవారం తెలిపారు. ఇటీవల ఆగిరిపల్లిలో రాష్ట్రస్థాయి హిల్ ప్యారడైజ్ ఆటల పోటీల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన భరత్‌బాబు అద్భుత ప్రదర్శన చేసి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జాతీయస్థాయిలో కూడా రాణించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఉయ్యూరు భవిత కేంద్రంలో చదువుతున్న కృష్ణచైతన్య ఈ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించారు. ఇరువురు విద్యార్థులను సమగ్ర శిక్ష కో–ఆర్డినేటర్ ఫణిదూర్జటి అభినందించారు.

ఊరెళుతున్నారా..ఇల్లు జాగ్రత్త!

బంటుమిల్లి: వేసవి సెలవుల దృష్ట్యా ఇతర ప్రాంతాలకు వెళ్లే స్థానికులు గృహ రక్షణ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని ఎస్ఐ గణేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వేసవిలో దొంగతనాలు జరిగే ప్రమాదం ఉన్నందున ఇంటి యజమానులు దూర ప్రాంతాలకు వెళుతూ ఇంటికి తాళాలు వేసే ముందు ఒకసారి పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. దీని కోసం ముందస్తు హెచ్చరికగా మైకుల ద్వారా మండలంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రజలు కూడా పోలీసులు చేస్తున్న ప్రచారానికి సహకరించి ప్రయాణాల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రకటన

[illegible]